
# సత్యవాక్కు




## క్రైస్తవ మాస పత్రిక

# కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్

రామారావు పేట

కా కి నా డ – 533 004.

అత్యుత్తమ శ్రమ శిక్షణ కొరకు బైబిలు శిక్షణ కొరకు స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌లో చేరండి. మంచి సువార్తికులుగా తయారవ్వండి. మంచి ఉపాధ్యాయులు కలరు ఎటువంటి రుసుములు లేవు. వయోపరిమితి లేదు. చక్కటి తరుణం !!

2 సంవత్సరముల కోర్సులో చేరుటకు ఇంటర్ మిడియట్‌గాని, అంతకు పైగా గాని చదివి యుండాలి.

6 వారముల తర్ఫీదులో చేరుటకు 10వ తరగతిగాని అంతకు పైగా గాని చదివి యుండాలి.

విద్యార్థులకు ఉచిత భోజన వసతి సౌకర్యములు, నెలసరి వేతనము (స్టయిపండ్ కలదు).

వివరములకు ఈరోజే వ్రాయండి :

THE DIRECTOR
Kakinada School of Preaching
P.O. Box 57, KAKINADA
533 004.

Phone : 0884-74882

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 13 సెప్టెంబరు 1992 సంచిక 2

## సంపాదకీయము

### యేసుక్రీస్తు దేవుని కుమారుడని ఎందుకు నమ్మవలెను?

### (Why Believe that Jesus Christ is the son of God?)

మొదటి శతాబ్దములోని వారినిగాని, ఇరువదియవ శతాబ్దము లోని వారినిగాని, మరి యే శతాబ్దములోని వారినైనను సరే ఒక ప్రాముఖ్యమైన ప్రశ్న అడుగుచున్నాను. క్రీస్తును గూర్చి మీ కేమి తోచుచున్నది? ఆయన యెవరి కుమారుడు? ఈ ప్రశ్న శతాబ్దముల తరబడి మానవుల చెవులలో మ్రోగుచున్నది. యేసు క్రీస్తు యెవని కుమారుడు? ఆయన దేవుని కుమారుడని నేను విశ్వసించుకొంటిని.

శతాబ్దముల నుండియు ఎంతో మంది మతనాయకు లుంటున్నారు. అయితే మన నాయకుడు దేవుని కుమారుడనే విశ్వాసము మనకున్నది. మన క్రైస్తవ విశ్వాసము చీకటిలోనికి దుమికేదిగాని, శాస్త్రవేత్తల

వ్యాఖ్యలనుబట్టి గాని లేక మరి యే యితరములైన ఊహలనుబట్టి కలిగినదికాదు. కాని మన విశ్వాసము స్థిరమైన, బలమైన సాక్ష్యముపై ఆధారపడినట్టిది. యేసు దేవుని కుమారుడని చెప్పుటకు కొన్ని నిదర్శనములు ఆలోచించుదము.

## బైబిలు సాక్ష్యమునుగూర్చి ఆలోచించుదము

## (Consider Biblical Testimony)

తండ్రియైన దేవుడే యేసు ఆయన కుమారుడని చెప్పెను. ఇదిగో ఈయనే నా ప్రియ కుమారుడు; ఈయనయందు నేనానందించుచున్నాను (మత్తయి 3:17; 17:5). తండ్రియైన దేవుడు ఆయనతోనే ఈ మాటలు చెప్పుచున్నాడు. నీవు నా కుమారుడవు, నేను నేడు నిన్ను కనియున్నాను అనియు; ఇదియుగాక నేను ఆయనకు తండ్రినై యుందును, ఆయన నాకు కుమారుడై యుండును. బైబిలునందు వ్రాయబడిన యెహోవా దేవుని మాటలను బట్టి యేసు దేవుని కుమారుడని నమ్మవలెను.

యేసుప్రభువు ఆయనే తన కుమారత్వమును గూర్చి చెప్పుకొనెను. నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని పేతురు చెప్పినపుడు ఆయన పేతురును గద్దించలేదు. అట్లు చెప్పవద్దని ఆటంకపరచలేదు గాని దానికి బదులుగా పేతురుతో ఈ మాటలు చెప్పెను: "సీమోను బర్ యోనా, నీవు ధన్యుడవు పరలోకమందున్న నాతండ్రి ఈ సంగతి నీకు బయలుపరచెనే గాని నరులు నీకు బయలుపరచలేదు (మత్తయి 16 : 16-17). పేతురు చెప్పిన మాటలకు యేసు పరలోక ఆమోద ముద్ర వేసెను. నీవు దేవుని కుమారుడవైన క్రీస్తువా ? అని అడిగిన ప్రశ్నకు యేసు, అవును నేనే ఆయనవనని జవాబు చెప్పెను (మార్కు 14 : 61-62). క్రొత్త నిబంధన గ్రంధము నిండా యేసు

గొప్ప కుమారత్వమును గూర్చి ఆయనే చెప్పుకొనిన మాటలు గలవు. ఇది యేమి తెలియజేయుచున్నది! ఆయన అబద్ధికుడనా, అనగా ఆయన యేమి కాదో దానిని గూర్చి అవునని చెప్పుకొనుచున్నాడనా? లేక ఆయన అపోహపడి అట్లు చెప్పుకొనుచుండెనా? లేక ఆయన నిజముగ దేవుని కుమారుడా? వీటిలో నీవు దేనిని నమ్ముదువు?

క్రొత్త నిబంధన సాక్ష్యము ఎంకను మరికొన్ని గలవు. దేవుని దూత యోసేపుతో ఈ విధముగా చెప్పెను: "ఇదిగో కన్యక గర్భవతియై కుమారుని కనును. ఆయనకు ఇమ్మానుయేలని పేరు పెట్టుదురు. ఇమ్మానుయేలను పేరునకు దేవుడు మనకు తోడని అర్థము" (మత్తయి 1 : 22-23). నతానియేలు యిట్లు చెప్పెను: "బోధకుడా, నీవు దేవుని కుమారుడవు, ఇశ్రాయేలు రాజువు" (యోహాను 1:49). యేసు తుఫానును సద్దణపినపుడు ఆ దోనెలోయున్న శిష్యులు నీవు నిజముగా దేవుని కుమారుడవని చెప్పి ఆయనకు మ్రొక్కిరి (మత్తయి 14:33). నపుంసకుడు యేసు దేవుని కుమారుడని ఫిలిప్పు దగ్గర ఒప్పుకొని బాప్తిస్మము పొందెను (అ.కా. 8:37). దయ్యములు సహితము ఆయన వాటిని వెడలగొట్టినపుడు అవి నీవు దేవుని కుమారుడని కేకలు వేసి చెప్పెను (లూకా 4 : 41). క్రొత్తనిబంధనలోని సాక్ష్యములను నీవు పరిశీలించినచో యేసు దేవుని కుమారుడని నీవు గ్రహించగలవు.

## నెరవేర్చబడిన ప్రవచనములను పరిశీలించుము

## (Consider the Fulfilled Prophecy)

మెస్సీయాను గూర్చినట్టి కొన్ని ప్రవచనములు, అవి యేసు క్రీస్తునందు ఎంత పరిపూర్ణముగ, నిర్దిష్టముగాను, ప్రత్యక్షముగ నెరవేరినవో గమనించుడము.

1. స్త్రీ సంతానము (ఆది. కా. 3 : 15; గలతి 4 : 4).
2. అబ్రాహాము సంతానము (ఆది. కా. 12 : 3; లూకా 3 : 34).

3. యూదా గోత్రము (ఆ.కా. 49:10; లూకా 3:33).
4. యాకోబు సంతానము (సంఖ్యా. కా. 24:17-19; మత్తయి 1 : 2).
5. దావీదు సంతానము (కీర్తనలు 132:11; మత్తయి 1:6).
6. కన్యక గర్భమున పుట్టును (యెషయా 7:14, మత్తయి 1).
7. అద్భుత కార్యములను జరిగించును (యెషయా 35:5-6; యోహాను 11:47).
8. ఆయన పొడవబడును (జెకర్యా 12:10; యోహాను 19:34-37).
9. సిలువ వేయబడును (దా.కీ. 22; మత్తయి 27).
10. మృతులలోనుండి లేపబడును (కీర్తనలు 16 : 10; అ. కా. 13 : 35-37).

మెస్సీయాను గూర్చినట్టి ప్రవచనములు డెబ్బది వరకు గలవు. ఇవి యన్నియు క్రీస్తు ప్రభువు పుట్టకమునుపు కొన్ని వందల సంవత్సరములకు పూర్వమే వ్రాయబడెను. అయినను అవి యన్నియు ఆయన యందు సంపూర్తిగ నిర్దిష్టముగ, సరియైన సమయమునకు నెరవేరెను. యేసుప్రభువు దేవుని కుమారుడని నమ్మవలెను; ఎందుకనగా పాత నిబంధన ప్రవచనము లన్నియు ఆయన యందు పూర్తిగా నెరవేర్చబడెను.

## అద్భుత కార్యములనుగూర్చి పరిశీలింతము

## (Consider Miracle Working)

యేసు అద్భుత కార్యములను చేయు శక్తి, సువార్తలను చదివినట్లయిన అవినీతి, అక్రమము, వేదన, దురాత్మలపై ఆయనకు అధికారమున్నట్లు మనము గ్రహించగలము. ఆయన నీటిని ద్రాక్షారసముగ మార్చెను. రోగులను స్వస్థపరచెను, కుంటివారిని, చెవిటివారిని, గ్రుడ్డివారిని, మూగవారిని, పక్షవాయువుగల వారిని యింకను నానావిధములైన రోగములు గలవారి నందరిని స్వస్థపరచెను. తుఫా

నును సద్దణచెను, చనిపోయిన వారిని లేవనెత్తెను, నీటిపై నడచెను, జనసమూహములకు ఆహారము పెట్టెను. ఇవన్నియు ఎందుచేత చేయబడెను? ఇవన్నియు ఎందుకు మనకొరకు వ్రాయబడెను? అపొస్తలుడైన యోహాను పరిశుద్ధాత్మచేత నింపబడినవాడై ఈ జవాబు నిచ్చెను: "మరియు అనేకమైన యితర సూచక క్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను; అవి ఈ గ్రంథమందు వ్రాయబడి యుండలేదు గాని యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను" (యోహాను 20 : 30-31). యేసు దేవుని కుమారుడని నమ్ముటకొరకు పరిశుద్ధాత్మ ప్రేరేపణద్వారా యివి వ్రాయబడినట్లు గ్రహించగలము.

ఒకసారి నేను ఇద్దరు మనుష్యులు మాట్లాడుకొనుచూ యుండగ వింటిని. వారిలో మొదటివాడు యేసుక్రీస్తు మానవుడని మాత్రమే నేను నమ్ముచున్నాననెను. నీవెందుకట్లు తలంచుచుంటివని ప్రశ్నించగా అతడు మానవునివలెనె యేసు ఆకలి గొనెను. ఆయన నిద్రపోయెను, ఆయన ఏడ్చెను, ఆయన చనిపోయెను. కనుకనే ఆయన మానవుడని నేను నమ్ముచున్నానని చెప్పెను. రెండవ వ్యక్తి స్నేహితుడా! నీవు సగము మట్టుకే ఆయనను గూర్చి చెప్పితివి. నీవన్నట్లుగానే ఆయన ఆ పనులన్నియు చేసెను. అయితే ఆయన ఆకలి గొనినవుడు ఆయన మానవుడే; ఆయన జనసమూహములకు భోజనము పెట్టినవుడు దేవుని కుమారుడు. ఆయన నిద్రపోయినవుడు మానవుడైతే, ఆయన నిద్రలేచి గాలిని తుఫానును సద్దణచినవుడు దేవుని కుమారుడు. ఆయన ఏడ్చినవుడు మానవుడైతే, లాజరును మృతులలోనుండి లేపినవుడు ఆయన దేవుని కుమారుడు. ఆయన మృతి చెందినవుడు మానవుడైతే, సమాధిని, మరణమును జయించి మృతులలో నుండి

లేచినపుడు శక్తిగల దేవుని కుమారునిగా ప్రకటింపబడెను. దేవునిచేత ఆమోదింపబడిన మానవునిగా అపొస్తలుడైన పేతురు యేసుప్రభువును గూర్చి చెప్పెను. "దేవుడు నజరేయుడగు యేసుచేత అద్భుతములను, మహత్కార్యములను, సూచక క్రియలను మీ మధ్యను చేయించి ఆయనను తన వలన మెప్పు పొందినవానిగా మీకు కనబరచెను" (అ.కా. 2:22).

ఆ స్నేహితు లిద్దరూ సత్యమునే మాట్లాడిరి. యేసు మానవుడు. యేసు-మనుష్యకుమారు డవడని జనులు చెప్పుకొనుచున్నారని తన శిష్యుల నడుగగా (మత్తయి 16:13) దేవుని కుమారుడు. అందుకు పేతురు-నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని చెప్పెను (మత్తయి 16:16).

— జాన్ బ్రౌన్.

—o—

## క్రీస్తు దేవుని కుమారుడని నమ్ముటకు గల మరికొన్ని కారణములు.

## (Other Reasons for Believing Christ is the son of God)

### ఆయన బోధనుగూర్చి ఆలోచించుడి

### (Consider His Teaching)

యేసు బోధించుటకు ప్రకటించుటకు వచ్చెను. యేసు వారి సమాజ మందిరములో బోధించెను. దేవుని రాజ్యమును గూర్చిన సువార్త ప్రకటించెను (మత్తయి 4:23). ఆయన యేలాగు బోధించెను? ఆయన అధికారముతో బోధించినట్లు బైబిలు తెలియబరచుచున్నది. ఆయన వారి శాస్త్రులవలె కాక అధికారముగల వానివలె వారి

బోధించెను (మత్తయి 7 : 29). బహుజన సమూహములు ఆయన యొద్దకు వచ్చిరి (మార్కు 4 : 1). ఆయన అందరిచేత ఘనత నొంది వారి సమాజ మందిరములలో బోధించుచు వచ్చెను (లూకా 4:15). ఆయన శక్తిని ప్రజలు గుర్తించిరి. బోధకుడా, నీవు దేవుని యొద్దనుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుమని (యోహాను 3:2) నీకొదేము ఆయనతో చెప్పెను. ఆ మనుష్యుడు మాటలాడినట్లు ఎవడును మాటలాడ లేదని యూదుల నాయకులు కూడ చెప్పిరి (యోహాను 7:46).

యేసుక్రీస్తు యొక్క బోధలను మనము పరిశీలించి నట్లయిన అంతకుమునుపు గాని, యిప్పుడుగాని యెవరును ఆయనవలె మాట్లాడ లేదని మనము తేలికగా గమనించగలము. అపొస్తలుడైన పౌలు ఆయన దేవుని స్వరూపమని వర్ణించెను. "దేవుని స్వరూపియైయున్న క్రీస్తు మహిమను కనుబరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింప కుండు నిమిత్తము" (II కొరింధి 4 : 4) ఆయన బోధలలో దేవుని స్వరూపమును మనము చూడగలము. ఆయన జ్ఞానము, గ్రహింపు శక్తి, తెలివి, ఆయన పవిత్రత అన్నియు యెహోవాకు సరిపోయినవే. ఆయన బోధలు ఆయన దేవుని కుమారుడని తెలియపరచుచున్నవి.

## లేఖనముల ఆధారమును గూర్చి పరిశీలించుడి

## (Consider the Thread of Scriptures)

నలుబది మంది గ్రంథకర్తలు షుమారు 1600 సంవత్సరములలో ఈ బైబిలు గ్రంథమును వ్రాసినప్పటికిని వారి ముఖ్య సిద్ధాంతము ఒక్కటే. ఈ గ్రంథము ఒక ఆశ్చర్యకరమైన పుస్తకము. ఎందుకనగా వివిధ గ్రంథకర్తలు వేరువేరు కాలములలో వ్రాసినప్పటికి వారందరూ కూడ రాబోయే మెస్సీయా రక్షకుని గూర్చియే వ్రాసిరి. ఆదికాండములో సృష్టికర్తయైన యేసు, ఆయన స్త్రీ సంతాన

మనియు, యూదా గోత్రమునుండి వచ్చుననియు చూతుము. నిర్గమ కాండము నుండి ద్వితియోపదేశ కాండము వరకు ధర్మశాస్త్రమును గూర్చియు, మోషే చెప్పిన ప్రవక్త యేసు అనియు చూడగలము ద్వితి 18 : 15; అ.కా. 3 : 22 లకు సరిపోల్చి చూడుము. ఆయన న్యాయ విధిని యేర్పాటుచేసెను. యెహోషువనుండి ఎస్తేరు వరకు అది చరిత్ర. యేసుక్రీస్తు న్యాయాధిపతిగ, రాజుగ మనకు తెలియును. యోబునుండి పరమగీతము వరకు యేసు దేవునియొక్క బలము, నీతి, జ్ఞానము. యెషయా నుండి మలాకీ వరకు ప్రవచనములు. యేసు ప్రవచన నెరవేర్పు, పాపిష్టి జనాంగము కొరకు వధింపబడిన దేవుని గొఱ్ఱెపిల్ల. మత్తయి, మార్కు, లూకా, యోహానులలో ఆయన యొక్క ఆశ్చర్యకరమైన జన్మము, పాపరహితమైన జీవితము, జ్ఞాన యుక్తమైన బోధలు, ప్రాయశ్చిత్తార్థమైన మరణము, మహిమ యుక్తమైన పునరుత్థానములు గలవు. అపొస్తలుల కార్యముల గ్రంథ ములో, ఆదిమ సంఘ చరిత్ర గలదు. బాధలలో, అపహాస్యములో, కౄరత్వములో, త్రోసివేయబడినపుడు, చెరసాలలో యుండినపుడు, చివరకు మరణము మట్టుకు పురుషులు, స్త్రీలు అందరు ధైర్యముతో యేసుకొరకు నిలువబడవలెను. రోమానుండి యూదా వరకు అవి వ్రాయబడిన ఉత్తరములు లేక పత్రికలు. యేసు సంఘమునకు శిరస్సనియు, దేవుని నీతి యనియు, మనకు జీవమును, వెలుగు, న్యాయాధిపతి, విమోచకుడు, దేవుని మహిమ సింహాసనమునకు ముందు మనలను నిలువబెట్టగల సమర్థనీయుడు అని తెలుసుకొందుము. ప్రకటన గ్రంథము క్రొత్తనిబంధనలోని ప్రవచనము. యేసు నమ్మకమైన సాక్షి. ఈ భూలోక రాజులకు రాజు, యూదా వంశము, దావీదు గోత్రము, తెల్లని గుఱ్ఱము నెక్కువాడు, రారాజు, ప్రభువులకు ప్రభువు, జయ క్రీస్తు, మృతులను జీవింప చేయువాడు, ఇపుడు పరిపాలించుచు, ఆయన తిరిగి వచ్చెదనని వాగ్దానము చేసెను. హెబ్రీ 1:1-2 లో

యేసుక్రీస్తు బైబిలు అంతటికి ముఖ్యమాంశము అని గ్రహించగలము. ఈ గ్రంథము సమయమనే నేత ద్వారా వణికిన పొతవాటి దారము వంటిది.

## ఆయనయొక్క కీర్తిని పరిశీలించుదము

## (Consider His Influence)

నజరేయుడైన యేసువలె ఈ ప్రపంచమును ప్రభావితము చేసిన వారెవరును లేరు. ఇహలోక సంబంధమైన తండ్రి లేకుండా మిక్కిలి దీనురాలైన తల్లికి జన్మించి నజరేతు అను చిన్న గ్రామములో పెంచబడిన క్రీస్తునుగూర్చి తలంచండి. ఆయన కాలములో యుండే యే మత నాయకులద్వారా యెటువంటి పత్రములుగాని పొందియుండ లేదు. ఆ దినములలో యుండే యే పాఠశాలనుండి యెటువంటి డిగ్రీలు కూడ పొందలేదు. మతనాయకులద్వారా చిన్న చూపు చూడబడినను అనేకమంది పేదలైనవారు, వ్యాధిగ్రస్తులు, నిరాశ, నిస్పృహలతో యుండినవారు, దేవదూషణ చేసి యున్నారనే నిందను భరించుచున్న వారు అనేకులాయనను వెంబడించిన వారున్నారు. ఆయనను వెంబడించిన వారిలో కొంతమంది క్రోధిష్టులై ఆయన సిలువపై మరణించవలెనని పట్టుబట్టిరి. ఆయన స్వంతముకాని వేరే సమాధిలో ఆయనకు సమాధి యేర్పరచబడెను.

సుమారు రెండువేల సంవత్సరముల క్రిందట దీనుడైన ఈ గలిలయుని శరీర రీతిగా చూచి, ఆయన సంగతులన్నియు ప్రపంచ మంతా ఎరిగియున్నారు కాని చరిత్ర ప్రకారము చూచినట్లయిన అనేకులు ఆయన కొరకు తమ జీవితములను సమర్పించుకొనినట్లు మనము చూడగలము. ఆయన నామము సమస్త నామములకు పై నామము ఆయన జీవితము, బోధలు, ప్రవర్తన, నీతి బోధలు— ఇవన్నియు వ్యక్తులను కుటుంబములను, తెగలను, పట్టణములను, జాతులను, ఖండములను కూడ మార్చినవి.

యేసు యెన్నడూ ఒక్క పుస్తకము కూడ వ్రాయలేదు. కాని వేలకొలది పుస్తకములు ఆయనను గూర్చి వ్రాయబడెను. వెయ్యి భాషలకు పైగా ఆయన మాటలు తర్జుమా చేయబడెను.

ఆయన యెన్నడూ సంగీతము కూర్చలేదు. కాని ఆయన రాజాధి రాజని, ప్రభువులకు ప్రభువని అనేక పాటలు ఆయనను గూర్చి రచింపబడెను. గొప్పగొప్ప తలాంతులు కలిగినవారు అనేకమంది తమ తలాంతులను ఆయన కొరకుపయోగించి ఆయనను గౌరవించిరి.

ఆయన యే పరిశుద్ధ స్థలమును కట్టలేదు. కాని ప్రతి ఖండములోను ఆయన పేరిట అనేక దేవాలయములు, మందిరములు, వసతి గృహములు మున్నగునవి కట్టబడి వాటిలో ఆయనను ఆరాధించుటకు, ఆయన పేరిట తండ్రికి ప్రార్థనలు చేయుటకు, నిత్యజీవ సత్యములను యౌవనులకు, వృద్ధులకు, అందరికీ ఒకే విధముగ బోధించుటకు ఉపయోగించుచున్నారు.

ఆయన యే ఆసుపత్రులను కట్టలేదు. కాని ఆయన శిష్యులు, ఆయనను వెంబడించువారు వ్యాధిగ్రస్థులను, అవసరతలలో యున్న వారిని, మరణావస్థలో యున్న వారిని ఆదరించి, బోధించి, పాపరోగముతో యున్న వారిని మార్గము, సత్యము జీవమునై యున్న పరమ వైద్యుడైన యేసునొద్దకు నడిపించుచున్నారు.

ఆయన యే పాఠశాలలు స్థాపించలేదు. కాని ఆయన పేరిట అనేకములైన పాఠశాలలు, తరగతులు, కళాశాలలు, యూనివర్సిటీలు స్థాపింపబడి వాటిలో ఆయన ఆజ్ఞలను, కట్టడలను గైకొనునట్లును, తమ ప్రవర్తనను సరిదిద్దుకొనుటకును బోధనలు చేయబడుచున్నవి.

ఆయన యే వైద్యమును యేర్పాటు చేయలేదు. కాని ప్రపంచమందంతటను ఆయన కట్టడల ననుసరించి ఆయన కొరకు నిలచి,

పోరాడి, చివరకు ప్రాణము పెట్టగలిగేవారు అనేకులు గలరు. వీరు తప్పును ఎదిరించి, యదార్థతను పైకెత్తి పట్టుకొని రారాజైన యేసు కొరకు బలమైన ఆత్మీయ సైనికులుగ యుండి దేవుని పట్టణమునకు వారు ప్రయాణము చేయుచున్నారు. శతాబ్దముల తరబడి ఆయన అడుగుజాడలు వచ్చుచున్నవి. ఆయనను వెంబడించువారి నందరిని స్త్రీలను, పురుషులను నీతి మార్గములోనికి నడిపించగల్గునట్లు వారికి ముందుండి ఆయన నడిపించుచున్నాడు.

క్రీస్తునుగూర్చి మీ కేమి తోచుచున్నది? ఆయన యెవరి కుమారుడు? అనే ప్రశ్నలను జ్ఞాపకము చేసికొందము (మత్తయి 22 : 42). స్నేహితులారా! ఈ సాక్ష్యమునుగూర్చి ఆలోచించండి. రోమా సైనికునివలె మీరు కూడ "నిజముగా ఈయన దేవుని కుమారుడు" అని చెప్పగలరు.

యేసును గూర్చి మీరేమి చేయుదురు? అని సువార్త పాట మిమ్మును అడుగుచున్నది. దేవుని అంగీకరించక తటస్థముగ యుండు వారు యేమీ చెప్పలేరు. కాని ఒక దినమున ఆయన నాకు యేమి చేయునని మీ మనస్సే మిమ్మును ప్రశ్నించును.

ఈ ప్రపంచములో అనేకమంది మహమ్మదును, బుద్ధుని, కన్ఫుషియాను, చంద్రుని, యుంకను వేరేవేరే దేవతలను పూజించు వారందరు మత నాయకులు, శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు, నడిపించేవారు, మతోన్మాదులు. అందరూ దేవుని బిడ్డలైన వారివలె ఈ ప్రపంచము నంతను బైబిలు బోధించు సువార్తతో నింపండి. యెహోవా తప్ప మరియొక దేవుడు లేడు. యేసు ఆయనయొక్క అద్వితీయ కుమారుడు. ఆయనయందు మాత్రమే నిత్యజీవము గలదు. మరి యెవరి వలనను నిత్యజీవము కలుగదు. ఆయనే రక్షకుడు.

—జాన్ బ్రాన్.

---

# యేసు : అపొస్తలుఁడు, ప్రధాన యాజకుడు, ప్రవక్త, బోధకుడు, పరిచారకుడు

## (Jesus : Apostle, High Priest, Prophet, Teacher and Servant)

### అపొస్తలుడు, ప్రధాన యాజకుడు

### (Apostle and High Priest)

మనము ఒప్పుకొనిన దానికి అపొస్తలుఁడును, ప్రధాన యాజకుడునైన యేసుమీాద లక్ష్యముంచుడి (హెబ్రీ 3:1). దేవుడు ఈ లోకమును ఎంతో ప్రేమించి, దానినిరక్షించుటకుగాను ఆయన కుమారుని పంపెను. దేవునికి ఒకేఒక్క కుమారుడు గలడు. ఆయన సువార్తికుడు. ఆయన మనుష్య కుమారునిగా ఈ భూలోకములోనికి వచ్చుటద్వారా దేవుని గొప్ప ప్రేమను బహిర్గతము చేసెను. అంతకు మునుపుగాని, యిప్పటివరకు గాని అంత గొప్ప ప్రేమను చూపినవారెవరునూ లేరు. ఆయన ఐశ్వర్యవంతుడయ్యు మీా నిమిత్తము దరిద్రుడాయెను. మిమ్మును ఐశ్వర్యవంతులుగా చేయుటకు ఆయన పేదవాడు కావలసి వచ్చెను. ఆయన ధనవంతుడై యుండియు మీారు తన దారిద్ర్యము వలన ధనవంతులు కావలెనని, మీా నిమిత్తము దరిద్రుడాయెను (II కొరింథి 8.9). పరలోక మహిమను విడిచిపెట్టి ఈ భూలోకములో శ్రమలు అనుభవించెను.

### నిజమైన ప్రవక్త (A True Prophet)

యేసుక్రీస్తు నిజమైన ప్రవక్త. ఆయన వాక్యమును శరీరధారిగా చేసెను. ఆ వాక్యము శరీరధారియై, కృపా సత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను (యోహాను 1 : 14). ఆయన దేవుని మాటలు

మాట్లాడుట మాత్రమే గాక ప్రపంచమున కంతకు దేవుని వాక్యమై యున్నాడు. అయ్యా! నీవు ప్రవక్తవని గ్రహించుచున్నానని బావి దగ్గర సమరయ స్త్రీ చెప్పుటలో ఎట్టి సందేహము లేదు (యోహాను 4:19). ఆయన దేవుని యెదుటను ప్రజలందరి యెదుటను క్రియలోను వాక్యములోను శక్తిగల ప్రవక్తయై యుండెను (లూకా 24:19) అని ఎమ్మాయికి పోవు శిష్యులాయనను గూర్చి చెప్పుటలో ఆశ్చర్యము లేదు.

జనసమూహములో కొందరు నిజముగా ఈయన ప్రవక్తే యనిరి (యోహాను 7 : 40). యేసు ఆయన శిష్యులతో ఆయన ప్రవచములను గూర్చి చెప్పెను. "ఏలయనగా నా యంతట నేనే మాట్లాడలేదు; నేను యేమనవలెనో, యేమి మాట్లాడవలెనో దానిని గూర్చి నన్ను పంపిన తండ్రియే నాకాజ్ఞ యిచ్చియున్నాడు. మరియు ఆయన ఆజ్ఞ నిత్యజీవమని నేనెరుగుదును గనుక నేను చెప్పు సంగతులను తండ్రి నాతో చెప్పిన ప్రకారము చెప్పుచున్నాననెను" (యోహాను 12:49-50). మీరు వినుచున్న మాట నా మాట కాదు, నన్ను పంపిన తండ్రిదే (యోహాను 14:24) అని చెప్పెను.

## శ్రేష్ఠమైన బోధకుడు (The Master Teacher)

యేసు శ్రేష్ఠమైన బోధకుడు. ఆయనకు యిహలోక సంబంధమైన యే డిగ్రీలు, పట్టములు లేకపోయినప్పటికిని మనకు తెలిసినంత వరకు ప్రాథమిక విద్యను మాత్రమే అభ్యసించి యుండెను. సన్ హెడ్రిన్ సభలో ప్రాముఖ్యతను కలిగియున్న నీకొదేము ఆయనకు రబ్బియను బిరుదు నిచ్చి దేవుని దగ్గరనుండి పంపబడిన బోధకుడవని ఆయనను గూర్చి చెప్పెను. బోధకుడా, నీవు దేవుని యొద్దనుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము (యోహాను 3:2) అని చెప్పెను. ఈ సందర్భముగ ఆయన యేమియు బదులు చెప్పలేదు గాని నీకొదేముతో

ఆయన సంభాషణ కొనసాగించెను. ఆ తరువాత కొన్ని దినములకు ఆయన తన శిష్యుల పాదములను కడుగుచున్నపుడు ఆ బిరుదును ఆమోదించెను. బోధకుడనియు, ప్రభువనియు మీరు నన్ను పిలుచుచున్నారు; నేను బోధకుడను ప్రభువును గనుక మీరిట్లు పిలుచుట న్యాయమే (యోహాను 13 : 13). సువార్తలలో ఆయన బోధలను గూర్చియు, ప్రజలయొక్క ప్రతి స్పందన గూర్చియు గలవు. జనసమూహములు ఆయన బోధకు ఆశ్చర్యపడుచుండిరి. ఆయన వారి శాస్త్రులవలె కాక అధికారముగల వానివలె వారికి బోధించెను (మత్తయి 7.29) ఈ ప్రపంచములో యెవరూ చేయనట్టి గొప్ప బోధలను ఆయన చేసెను. ఆయన బోధలు వినిన అనేకులు ప్రభావితులై అప్పటినుండి ఆయనను వెంబడించుటలో ఆకర్షితులగుచున్నారు.

## యేసు పరిచారకుడు (Jesus a Servant)

పరిచారకునిగా యేసు తన్ను తాను ఒప్పుకొనెను. మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదుగాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణమును ఇచ్చుటకును వచ్చెననెను (మార్కు 10:45). ఇది చాల పరిచయమైన వాక్యమే అయినప్పటికిని దీనిలో ప్రాముఖ్యమైన భాగమును నిర్లక్ష్యము చేయబడుచుండును. యేసుక్రీస్తు దినములలో "మనుష్య కుమారుడు" అనే మాట చాల ప్రస్తావనకు వచ్చుచుండెడిది. అది మెస్సీయాకు సంబధించిన బిరుదు. ఏ సమయమందైనను మనుష్య కుమారుడు వచ్చునని వారు కనిపెట్టుచుండిరి. ఈ విషయమును గూర్చిన ప్రత్యేకతలు యెన్నో గలవు కాని ఒక విషయము మనము గ్రహించవలెను. ప్రతివారు ఒప్పుకునే ఒక ప్రత్యేక విషయమేమంటె మనుష్య కుమారుడు జనాంగములద్వారా గౌరవము, అధి

పత్యము, అధికారము పొందునని వారి యుద్దేశము. దానియేలు ప్రవచనము చూడుడి: సకల జనులును, రాష్ట్రములును, ఆయా భాషలు మాట్లాడువారును ఆయనను సేవించునట్లు ప్రభుత్వమును, మహిమయు ఆధిపత్యమును ఆయన కీయబడెను (దానియేలు 7:14).

అయితే ప్రభువైన యేసు దాని నంతటిని తారుమారు చేసెను. మీరు పూర్తిగ పొరబడుచున్నారు. మనుష్య కుమారుడు పరిచారము చేయుటకు వచ్చెను గాని పరిచారము చేయించుకొనుటకు రాలేదు. మీరింకను గ్రహింపకున్నారా? (మార్కు 8 : 31) అని చెప్పెను. మనుష్య కుమారుడు యూదా జనాంగములో గొప్ప ఘనతకు సూచనగా యున్నాడు. దేవుని యొక్క పరిచారకుడు గాఢమైన దీనత్వమును వెలిబుచ్చుచున్నాడు. ఈ రెండు విభిన్నమైన మనోభావములను ఆయన జీవితములోను, బోధలోను ఐక్యపరచి ప్రదర్శించియున్నాడు.

విందులలో అగ్రస్థానములను, సమాజ మందిరములలో అగ్రపీఠములను, సంత వీధులలో వందనములను, మనుష్యులచేత బోధకులని పిలువబడుటను ఆశించువారిని గూర్చి ప్రభువైన యేసు బహిరంగముగ ఖండించినట్లు మనము మత్తయి 23:6 ద్వారా గ్రహించగలము. బిరుదులు పొందుటకును, ఆధిక్యతలు పొందుటకును ప్రభువైన యేసు నిరాకరించెను. "మీరు బోధకులని పిలువబడవద్దు. ఒక్కడే మీ బోధకుడు. మీరందరు సహోదరులు. భూమిమీద ఎవనికైనను తండ్రి యని పేరు పెట్టవద్దు; ఒక్కడే మీ తండ్రి. ఆయన పరలోకమందున్నాడు. మీరు గురువులని పిలువబడవద్దు; క్రీస్తు ఒక్కడే మీ గురువు. మీలో అందరికంటె గొప్పవాడు మీకు పరిచారకుడై యుండవలెను" (మత్తయి 23 : 8-11). వీటన్నిటిని ప్రభువైన యేసు నిరాకరించెను. ఆయనకు బిరుదులు, ఘనతయు కావలెనని

కోరినచో అందరికంటె ముఖ్యమైన ఘనత ఆయనకే. అయితే బహు మానములకంటె, ఘనతకంటె ఆయన పరిచర్యకు ముఖ్యమైన ప్రాధాన్యత నిచ్చెను. క్రీస్తు మాదిరిని సంఘములలో ఈ దినములలో మనము అనుసరింతమా.

—టామ్ కెల్టన్.

—o—

## చిన్న బిడ్డలు

విచ్చుకున్న పువ్వు దోసి పాప నవ్వు
కేరింత రేయిక వింత పాలపుంత
కంటిలో నీలాలు కదిలాడితే చాలు
మింట తారకలల్లే మెరువు జల్లు!

అడుగులంటిన చోట అందాల పూదోట
ఆటలాడిన చోట తేట వెన్నెల బాట
పాపాయి పనులలో పాపమే కనరాదు
పసివాళ్ళ చూపులే పసిడి కిరణాలు!

చిన్న బిడ్డ లెపుడు దైవ స్వరూపులే
చిన్న బాలలదేను యేసు రాజ్యం
చిన్న బిడ్డలవలె పెద్దలు శుద్ధులై
యేసు దరి నిలిచిన ఎంతమేలు!

(లూకా 18:16-17; మత్తై 18:3-4; మార్కు 9:37)

—యస్.జె. మేడిది, కోణశివాపే.

—o—

# యేసు ఏడ్చెను

## (Jesus Wept) యోహాను 11 : 35

బైబిలు అంతటిలోను యిది చాల చిన్న వచనమే అయినప్పటికిని మన బోధకుని గూర్చి మనకనేక విషయములు ఈ వచనము ద్వారా తెలియుచున్నవి. శిష్యుల ముందు బహిరంగముగా ఆయన ఏడ్చుట ఈ ఒక్క పర్యాయమే కాదు. ప్రియ వైద్యుడైన లూకా యెరూషలేము పట్టణమును గూర్చి ఆయన యేడ్చినట్లు చెప్పెను. ఆయన పట్టణమునకు సమీపించి నపుడు దానిని చూచి దాని విషయమై యేడ్చెను (లూకా 19 : 4).

యేసు ఏడ్చుట మాత్రమే గాక ఆయనను వెంబడించు వారిని కంటి నీరు కార్చు పరిస్థితులలో హెచ్చరించినట్లు కూడ చూడగలము.

యేసే ఆమెయొక్క నిరీక్షణ యని గ్రహించుకొనిన స్త్రీ, ఆయనను ప్రేమించి పరిసయ్యుడైన సీమోను యింటికి ఆయనను వెంబడించెను. అచ్చట ఆమె యేడ్చి ఆ కన్నీటితో ఆయన పాదములు కడిగి, తలవెండ్రుకలతో ఆ పాదములు తుడిచెను (లూకా 7 : 37-38).

ఎఫెసు సంఘ పెద్దలతో పౌలు చెప్పిన మాటలు : నేను ఆసియాలో కాలు పెట్టిన దినము నుండి ఎల్లకాలము మీ మధ్య ఏలాగు నడచుకొంటినో మీరే ఎరుగుదురు. యూదుల కుట్రలవలన నాకు శోధనలు సంభవించినను కన్నీళ్ళు విడుచుచు పూర్ణమైన వినయ భావముతో నేనేలాగు ప్రభువును సేవించుచుంటినో మీకే తెలియును (అపొ.కా. 20 : 18-19). క్రీస్తు సిలువకు విరోధముగ యుండిన వారిని గూర్చి కూడ ఆయన ఏడ్చెను. "అనేకులు క్రీస్తు సిలువకు శత్రువులుగా నడచుకొనుకొన్నారు; వీరినిగూర్చి మీతో అనేక పర్యాయములు చెప్పి యిప్పుడును యేడ్చుచు చెప్పుచున్నాను" (ఫిలిప్పీ 3:18).

## వ్యక్తిగత ఉద్రేకములు (Personal Emotions)

నేను చాల వ్యక్తిగత ఉద్రేకములు కలిగిన వ్యక్తిని. నా బాల్యమును నాకు జ్ఞాపకము చేసేలాంటి ప్రసారములు దూరదర్శన్‌లో వచ్చినపుడు వాటిని చూచి నేను ఏడ్చుదును. ఎవరికైన అవమానము కలుగుటగాని, ఘనత కలుగుట గాని నేను చూచినచో ఏడ్పు కలుగును. వివాహ కార్యములలో గాని, గ్రాడ్యుయేషన్ సమయములో గాని నేను ఏడ్చెదను. ఈ విధముగ నేను అనేక పర్యాయములు ఏడ్చుదును. ఇక నన్ను గూర్చి నేను యేమి చెప్పుకొనగలను. నేను చాల ఉద్రేకముగల వ్యక్తిని. అయితే కొన్నిసార్లు నాకు ఒక విధమైన భావము కలిగినప్పటికిని నేను సిగ్గుపడను.

మనము లేఖనములను చదువుచుండగ పరిశుద్ధుల యొక్క దుఃఖము సర్వసాధారణముగ యుండినట్లు మనము చూచుదుము. ఇది వారి జీవితములలో ఒక క్రియ మాత్రమే గాక, మనకు ఆజ్ఞకూడ అయియున్నది. ఏడ్చువారితో ఏడ్వుడి (రోమా 12:15).

నేను పెద్దవాడనగుచుండగా పెద్దబాలురు ఏడ్వకూడదు అని చెప్పబడుచున్న మాటలు నన్ను చాల కలవర పెట్టుచుండెడివి. నా కంటినీటిని నేను ఆపుకొనలేక పోయేవాడిని. ఒక పురుషునిగా మంచి బలమైన కారణములు ఒక వ్యక్తి ఏడ్చునట్లు చేయునని నేర్చుకొంటిని. కొన్ని సందర్భములలో బలవంతులైనవారు ఏడ్వరు. అది వారి బలహీనతయే.

ఎల్లవేళలా మానవాళి అంతటియందును యేసు గాఢమైన ప్రేమ కలిగి యున్నారు. ఆయన బేతనియలో ఏడ్చినపుడు మార్త మరియల దుఃఖమును గ్రహించెను; చనిపోయిన వానియెడల ఆయనకు గాఢమైన ప్రేమ యుండెను.

ఏడ్చుటకు దుఃఖము ఒక మూలకారణము. ఇచ్చట మనమొక విషయమును గ్రహించవలెను. మన క్రియలను పోగొట్టుకొనిన దానిని

బట్టి కలిగే దుఃఖము అది ఒక్కటే విచారమునకు కారణము కాదు. వారి జీవితములు పాపముతో నిండియుండినపుడు కొందరు క్రైస్తవులు ఏడ్చుట నేను చూచితిని. కొంతమంది గుంపులో నేను ఒకసారి యుండినపుడు వ్యభిచారములో యున్న ఒక సహోదరుని యే విధముగ ధర్శించి మాట్లాడవలెననెడి విషయమునుగూర్చి ఆలోచించుచుండిరి. వారిలో ఒక బలవంతుడైన వ్యక్తి రోదకరు ఈ మరియొక వ్యక్తి యొక్క పాపములను బట్టి గట్టిగా ఏడ్చుటను నేను పరిశీలించితిని. కొంతమంది తమ ప్రియులు కానందున వారు దేవుని వాక్యము బోధింపబడు చుండగా దానికి పెడచెవి పెట్టుచున్నారని ఏడ్చిరి. ఏడ్చుట వారి సహజీవనము గనుక వీరందరు అట్లు ఏడ్చుచుండిరి.

పౌలు ఏడ్చువారితో ఏడ్వుడి యని చెప్పుచున్నాడు. తమ ప్రియులను పోగొట్టుకొనిన వారి గుంపుతో కలసి ఒకసారి నేనుంటిని. ప్రతిసారి బోధించుటకు నేను పిలువబడినపుడు చక్కని ఆరాధన క్రమమును సమాధి కొరకు నేను చేయవలసి వచ్చేది. ఆ శవము యొక్క తలదగ్గరకు నేను దిగి రావడము నాకు బహు కష్టముగ యుండేది. ఎందుకనగా విడనాడబడిన కుటుంబము వారికి నేను ఎంతో బలమైన సహాయకారిగా యుండవలెనని తలంచెడివాడను కాని నా కళ్ళు కన్నీళ్ళతో నిండిపోయేవి.

ఏడ్చుటకు "దయ" కూడ ఒక కారణమే. తరచుగా సమాధి కార్యక్రమములకు నేను ఆహ్వానింపబడుచుండినపుడు అస్సలు తెలియని వారికికూడ నేను ఆ కార్యము జరిగింపవలసి వచ్చేది. ఆ కుటుంబ సభ్యులను నేను చూచినపుడు నాకు కన్నీళ్ళు వచ్చేవి.

దయ చూపించుటకు మరణ మొక్కటి మాత్రమే కారణము కాదు. భయంకరమైన కుటుంబ జీవితము గల వ్యక్తులను నేనెరుగుదును. వారిలో కొంతమంది చాల పేదవారు, కొంతమంది వారికి

కలిగిన సమస్తము అగ్నిలో నాశనమై పోయినవారు. కొంతమంది తుఫాను వలన నష్టపోయినవారు. ఉద్యోగమును పోగొట్టుకొని కుటుంబ పోషణకొరకు కుటుంబము నంతటిని విడచి వేరు స్థలమునకు వెళ్ళుచుండిన సహోదరుని చూచి నేను ఏడ్చితిని.

## సంతోషము కలిగినప్పుడు కూడ దుఃఖము వచ్చును

## (Weeping because of Joy)

ఇంతవరకు విచారము వలన దుఃఖము వచ్చునని నేను వ్రాసితిని. కన్నీళ్ళు కార్చుటకు ముఖ్యకారణము విచారమే కాని సంతోషముచేత కూడ ఏడ్పు వచ్చును.

ఇతర సంఘములనుండి నా కుమారులు విశ్వాసములో యున్న సంఘ సభ్యులను గూర్చి చెప్పిన మాటలను నేను వినినపుడు సంతోషముతో నాకు దుఃఖము వచ్చును. నా కుమార్తె తన కళాశాలలో ప్రెసిడెంటుగా ఎన్నుకొనబడినదని వినినపుడుకూడ సంతోషముతో కూడిన ఏడ్పు నాకు కలిగెను.

1978లో నేను హారిసన్ ఆసుపత్రిలో చాలకాలము గడుప వలసి వచ్చెను. ఆ సమయములో నేను ఆరాధనలకు వెళ్ళలేక పోయెడివాడను. ఆదివారము నేను తిరిగి మరియొక స్థలములోని చిన్న సంఘమునకు వచ్చినపుడు వారు చక్కని రీతిగా పాడుటను నేను జ్ఞాపకము చేసుకొంటిని. అది నాకు చాల సంతోషమును కలిగించినది. ఆ సంఘ సభ్యులను కలసికొని తిరిగి అచ్చట దేవుని వాక్య పరిచర్య చేయుటకు నేను ప్రసంగవేదిక దగ్గరకు వెళ్లుచుండగా ఆనందముతో నాకు కన్నీరు కలిగింది.

నేను యోహాను 11 : 35 చదువుచుండగా యేసు ఏడ్చినది దుఃఖము, దయ, స్నేహితులైన వారిని గూర్చిన విచారముతో

మా ర్త్రిమే గారి సంతోషము చేత గూడ వచ్చినట్లు గ్రహించితిని. శిష్యులు వారి యజమానుని సేవ విషయములో ఎంత దూరము వెళ్ళుటకైనను యిష్టముతో యుండిరి. మార్త - అవును ప్రభువా, నీవు లోకమునకు రావలసిన దేవుని కుమారుడవైన క్రీస్తువని నమ్ముచున్నానని ఆయనతో చెప్పెను (యోహాను 11:27).

మీ హృదయ భావోద్రేకముల ప్రకారము మీ ప్రేమను చూపుటకు సిగ్గుపడనవసరము లేదు. దుఃఖముతోను, వేదనతోను కూడిన మీ కన్నీరు సమస్తమును పోగొట్టుకొన్నామని బాధపడేవారి వేదనకు అదియొక జవాబుగ యుండును. బీటలుబారిన నేలకు వర్షపు చినుకులుండు రీతిగా సంతోషముతో కూడిన మీ కన్నీటి బిందువులు వారికి హృదయానందకరముగ యుండును. అవి దేవుని నుండి దయ అనెడి నదులు మీ కన్నులద్వారా ప్రవహించినట్లుండును.

## కనిపెట్టవద్దు (Do not Wait)

దేవునియొక్క ఆ మహా భయంకర దినము వరకు వారి స్వంత కన్నీటిని గూర్చిన పాఠములు నేర్చుకొనకుండా కనిపెట్టువారినిగూర్చి చాల విచారము. అయితే ఆయన యిచ్చు ఆశీర్వాదములను పొందుటకు చాల ఆలస్యమగుటద్వారా ఆనంద బాష్పములకు బదులు ఆయన దుఃఖముతో కూడిన కన్నీటితో అంతిమ తీర్పు చెప్పును. అక్రమము చేయువారలారా, నాయొద్దనుండి తొలగిపోవుడి. మీకొరకు సిద్ధపరచబడిన ఆ నిత్యాగ్ని లోకి పోవుడి. అచ్చట యేడ్పును, పండ్లు కొరుకుటయు నుండును.

ఈ దినమున దీనిని మనము చదువుచుండగా ఈ లోక విషయములనుండి తొలగిపోవుటకు యింకను సమయము గలదు. యేసు దేవుని కుమారుడని నమ్ముము. ఆ విశ్వాసము నిన్ను పశ్చాత్తాపమునకు నడిపించును. మనుష్యుల యెదుట ఆయనను ఒప్పుకొని బాప్తిస్మము

ద్వారా యేసు రక్తములో నీ పాపములను కడిగివేసుకొనుము (యోహాను 8:24; లూకా 13:3; మత్తయి 10:32; అ.కా. 22:16). అటు తరువాత నీవు క్రొత్తజీవితములో నడువగలవు. దేవుని సేవ చేయగలవు. కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలో నుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతన జీవము పొందిన వారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మము వలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి (రోమా 6:4).

— చార్ల్స్ R. రోజ్.

—o—

## ప్రభువు దయను పొందిన నిస్సహాయుడు

## (A Helpless Man Who Got Mercy of the Lord)

యేసుక్రీస్తు భూమిమీద జీవించియున్న కాలంలో నిస్సహాయులపై తన దృష్టిని కేంద్రీకరించెను. యెరూషలేములో బేతెస్థ అనబడిన కోనేరు దగ్గరకు యేసు వెళ్ళెను. అక్కడ రోగులు, గ్రుడ్డివారు, కుంటివారు, ఊచకాలు చేతులుగలవారు గుంపులుగా పడియుండిరి. వీరందరు అక్కడ పడియుండుటకు కారణమేమనగా "ఆయా సమయములకు దేవదూత కోనేటిలో దిగి నీళ్ళు కదలించుట కలదు. నీరు కదలింపబడిన పిమ్మట మొదట ఎవడు దిగునో వాడు ఎట్టివ్యాధి కలవాడైనను బాగుపడును" (యోహా 5 : 1-4). వీరందరు స్వస్థత పొందగోరి ఆ అయిదు మంటపములలో గుంపులుగా పడి యుండిరి.

అక్కడ నిస్సహాయస్థితిలో నున్న ఒక వ్యాధిగ్రస్తు డుండెను. అతడు కూడ మిగిలినవారివలె స్వస్థత పొందగోరి 38 సంవత్సరాలు అంటే సుమారు 13,870 దినాలు సుదీర్ఘ నిరీక్షణతో అక్కడ పడియుండెను. యేసు వాడు పడియుండుట చూచి, వాడప్పటికి బహుకాలమునుండి ఆ స్థితిలో నున్నాడని ఎరిగి - స్వస్థపడగోరుచున్నావా అని వాని నడుగగా; ఆ రోగి అయ్యా, నీళ్లు కదలింపబడినప్పుడు నన్ను

కోనేటిలో దించుటకు నాకు ఎవడును లేడు గనుక నేను వచ్చునంతలో మరియొకడు నాకంటె ముందుగా దిగునని ఆయనకు ఉత్తరమిచ్చెను. ఈ విధముగ తన నిస్సహాయతను అతడు ప్రభువునకు తెలియజేసెను.

"స్వస్థపడ గోరుచున్నావా!" అని ప్రభువు అడిగిన మాట మనకు ఆశ్చర్యాన్ని కలిగించవచ్చును. ఎందుకంటే అతడు స్వస్థపడ గోరి 38 సంవత్సరములనుండి అక్కడ వేచి యుండెనని ప్రభువు ఎరిగి యుండెను (యోహా 5 : 6). ప్రభువు ఈ విధముగ ప్రశ్నించుటలో ఆత్మసంబంధమైన తన సంకల్పమును గ్రహించవచ్చును.

ఈనాడు పాపియైన మానవుడు తన విశ్వాసమును నోటితో ఒప్పుకొనుట ఆయన సంకల్పము. "ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును. రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును" రోమా 10:10.

స్వస్థత పొందగోరిన వ్యాధిగ్రస్థుడు తాను స్వస్థత పొందగోరునట్లు నోటితో ఒప్పుకొనుట ప్రభువు చిత్తమై యున్నది. తన అభీష్టాన్ని నోటితో ఒప్పుకొని ప్రభువుద్వారా ఇతడు స్వస్థత పొందెను.

ఎందరో రోగులమధ్య ప్రభువు దృష్టి ఈ నిస్సహాయునిపై పడింది, అతనిని కోనేటిలో దించుటకు ఎవరూలేని కారణం చేత అతడు స్వస్థత పొందలేని స్థితిలో ఉండగా ప్రభువు అతని యొద్దకు వచ్చి అతనితో సంభాషించెను. దీనులయెడల ఆయన తన దయను కనుపరచెను. "నీవు లేచి నీ పరుపెత్తుకొని నడువుమని వానితో చెప్పగా వెంటనే వాడు స్వస్థత పొంది తన పరుపెత్తికొని నడిచెను" (యోహాను 5:8). ప్రభువు మాటతో ఈ నిస్సహాయుడు సంపూర్ణమైన ఆరోగ్యాన్ని తిరిగి పొందగలిగెను. యేసు పుట్టక పూర్వమునుండి ఈ మనుష్యుడు అక్కడ పడియుండెను. 38 సంవత్సరాలుగా అతడు కలిగియున్న వ్యాధి క్రీస్తు రాకడతో ఆయన మాటతో నివారణ మయ్యెను.

"నాకు ఎవడును లేడు" అనే మాటలో తాను ఒంటరివాడినని, నాకు సహాయపడు వారెవరూ లేరని ప్రభువునకు మనవి చేసిన వెంటనే ఆయన అతనిని బాగుచేసెను. "నలిగినవారికి ఆయన మహా దుర్గమగును." నిస్సహాయులను గుర్తించి వారి చీకటి జీవితంలో తన దివ్య కాంతిని ప్రసరింపజేసిన ప్రేమమూర్తి, కరుణామయుడు యేసుప్రభువు.

మానవులకొరకు కలువరి సిలువలో తన రక్తమును చిందించుట ద్వారా వారియెడల తన ప్రేమను వ్యక్తముచేసెను. "మీరీలాగు రక్షింపబడి మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క మహిమను పొందవలెనని, ఆయన మా సువార్త వలన మిమ్మును పిలిచెను" II థెస్స 2 : 14.

ఆయనను విశ్వసించి, మారుమనస్సు పొంది, ఆయన ప్రభువని నోటితో ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందితే ఆయన రక్తముతో కొనబడిన ఆయన సంఘములో సభ్యుడవై నీవు ఆనందించగలవు. —E.K.V. ప్రసాదరావు, చెయ్యేరు.

—o—

## సంక్షిప్త వార్తలు

ఆగష్టు నెల సువార్తికుల సమావేశము మరియు సువార్త కూటము పాలకొల్లు (క్రిష్టియన్ పేట) లో నున్న విశాలమైన 'చర్చి బిల్డింగ్' లో ఆనందదాయకంగా, ఆశీర్వాదకరంగా జరిగెను. అపవాది దేవుని పనికి ఎన్ని ఆటంకములు కలుగజేయుచున్నను దేవుని సత్య సువార్త నలుదిక్కులకు ప్రతిధ్వనించుచునేయున్నది. ఆయన జ్ఞానముయొక్క సువాసనను కనుపరచుటకు మమ్ములను విజయోత్సవముతో ఊరేగించుచున్న దేవునికి స్తోత్రములు చెల్లించుచున్నాము. ఆశ్చర్యకరంగా 100 మంది సువార్తికుల సమక్షంలో "నేను దేవుని చిత్తమును గ్రహించుట లేఖనముల నుండియా ? లేక దర్శనముల నుండియా ?" అను మంచి అంశము చర్చించబడెను.

ఉదయం సమావేశమునకు వడ్డి చిన్నయగారు అధ్యక్షత వహించగా సోదరులు యస్. ఎబినెజరుగారు (పాలకొల్లు) డి. శ్రీరాములు గారు, (ములపర్రు) పి. సమూయేలుగారు, (ఆచంట) జి. షడ్రిక్ గారు, (పాలకొల్లు) యస్. ఏలియాగారు, (దేవగుప్తం) చర్చలో పాల్గొనిరి. "నేడు సంపూర్ణమైన దేవుని చిత్తము (రోమా 12 : 2) మనయొద్ద గ్రంథరూపమున ఉండగా దర్శనముల కొరకు ఎదురు చూడవలసిన పని లేదని, కొందరు దర్శనముల కొరకు ఎదురు చూచుచు దేవుని వాక్యమును విశ్వసించుట లేదని" చెప్పిరి. దర్శనములు కలుగుచున్నవని భావించేవారు మానసిక వ్యాధిగ్రస్థులని తెలియజేసిరి. మనము దేవుని వాక్యమును చదివి దానికి లోబడి యుండాలని చెప్పిరి.

మధ్యాహ్న సమావేశమునకు సోదరులు E.K.V. ప్రసాదరావు గారు అధ్యక్షత వహించగా శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మం నుండి వచ్చిన R Ch. సద్గుణరావుగారు ఈ అంశముపై చక్కని వివరణ యిచ్చిరి. అనంతరం సోదరులు పాల్ గూటంగారు మాటలాడుచు యోవేలు 2 : 23 లో వ్రాయబడిన ప్రవచనమును పెంతెకోస్తు దినమున పేతురు ఎందుకు జ్ఞాపకము చేసెనో తెలియజేసిరి. "సర్వజనుల మీద" అంటే యూదులకు మాత్రమేగాక అన్యజనుల మీదకూడ నా ఆత్మను కుమ్మరింతునని దేవుడు వాగ్దానము చేసెనని" చెప్పిరి. దేవదూతలకు సువార్త ప్రకటించే అధికారము దేవుడివ్వలేదని, సువార్త ప్రకటన బాధ్యతను ఆయన మానవుల కప్పగించెనని చెప్పిరి. లేఖనములు చదివి నేడు దేవుని చిత్తాన్ని గ్రహించాలని దర్శనముల ద్వారా కాదని తెలియజేసిరి.

సోదరులు జాషువా గూటంగారు మాటలాడుచు నిర్గ 20:19లో ఇశ్రాయేలీయులు మోషేతో మాటలాడిన మాటలు గుర్తుచేసిరి. "నీవు మాతో మాటలాడుము. దేవుడు మాతో మాటలాడిన యెడల మేము చనిపోవుదుము". దేవుడు మోషేద్వారా వారితో మాటలాడెను. అగ్ని జ్వాలలలో యాతన పడుచున్న ధనవంతుడు తన అయిదుగురు సహోదరులు రక్షింపబడవలెననే కోరికతో లాజరును పంప

వలెనని అబ్రాహామును వేడుకొనెను. అబ్రాహాము "మోషేయు ప్రవక్తలును చెప్పిన మాటలు వారు విననియెడల మృతులలోనుండి ఒకడు లేచినను వారు నమ్మరని అతనితో చెప్పెను". (లూకా 16 : 31). లేఖనములను మనము వినవలెననునది దీని సారాంశము.

సువార్తికుల సమావేశానంతరం 13 మంది పాపక్షమాపణ నిమిత్తం క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. రాత్రి కూటమందు "యేసుక్రీస్తు దేవుడు మరియు మానవుడు" అను అంశమును తన సహజ శైలిలో జాషువాగారు చక్కగా బోధించిరి. రాత్రి కూటమునకు సుమారు 300 మంది హాజరై దేవుని వాక్యమును వినిరి. అనంతరం సంతోష వదనాలతో తిరిగి తమ గృహాలకు చేరుకొనిరి. పాలకొల్లులో సోదరులు నికోలస్ పీటర్సన్‌గారు, జి. పత్రిక్ గారు గొప్ప పరిచర్యను దేవుని మహిమార్థమై జరిగించుచున్నారు. ★

---

Regd. No. H/KD—45/KD H.O.

From
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To